స.హ.చట్టం



బుద్దా మురళి

# అధికార భాషలో ప్రశ్నిద్దాం

**సమాచారం తెలుసుకొనే హక్కు లేనప్పుడు వాక్ స్వాతంత్ర్యం సంపూర్ణం కాదు అనే భావన నుంచి పుట్టిందే సమాచార హక్కు చట్టం 2005. వయోజన ఓటు హక్కు తర్వాత ప్రజల చేతికి అంతశక్తిమంతమైన ఆయుధం సమాచార హక్కు చట్టంతో లభించింది. నీ వద్ద ఓ సమాచారం అంటూ ఉంటేనే కదా? మాట్లాడేది. సమాచారం తెలుసుకొనే హక్కు తనకు ఉందని సామాన్యులకు తెలియాలంటే అది మాతృభాష ద్వారానే సాధ్యం అవుతుంది. సమాచార హక్కు చట్టంలో ఇంగ్లీష్, హిందీతో పాటు ఆయా రాష్ట్రాల అధికార భాషలో సమాచారం అందించాలని చట్టంలో పలుచోట్ల పేర్కొన్నది.**

పరిపాలనకు సంబంధించిన సమాచారం మాతృభాషలో విస్తృతంగా అందుబాటులో ఉండేటట్లు చూడమని చెబుతున్నదీ చట్టం. సామాన్యులను శక్తివంతంగా మార్చే ఎన్నో చట్టాలను మనం తయారుచేసుకున్నా అవేవీ సామాన్యులకు అర్థమయ్యే భాషలో లేవు. ఇంగ్లీషులో ఉన్నాయని, మనం భావిస్తున్న చట్టాల్లోని చాలా పదాలు లాటిన్ భాషలోనివి. పలు యూరప్ దేశాల్లో ఈ లాటిన్ పదాలు ఇంగ్లీష్ చట్టాలను సులభమైన ఇంగ్లీష్‌లోకి మార్చాలనే ఉద్యమాలు సాగుతున్నాయి. ఇటీవల తెలుగులో ఓ చట్టాన్ని చదివితే అందులో ఉన్న ఒక మాట ఇంగ్లీష్ నుంచి సులభమైన ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసి, సులభమైన ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువాదం చేసినట్టు పేర్కొన్నారు. అది చదివి దీన్ని సులభమైన తెలుగులోకి అనువాదం చేయాలనిపించింది. ప్రజల కోసం చట్టాలు అనుకున్నప్పుడు అవి ప్రజల భాషలో అందుబాటులో ఉండాలి. న్యాయవాదులు కూడా ఇంగ్లీష్ నుంచి సులభమైన ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసుకోవలసిన పరిస్థితి ఉంటే ఇక ఆ చట్టం ఎవరి కోసమైతే ఉద్దేశించిందో, ఆ సామాన్యుల పరిస్థితి ఏంటి?

అత్యంత శక్తిమంతమైన సమాచార హక్కు చట్టం ఇప్పటికీ సామాన్య ప్రజల్లోకి వెళ్ళలేదు. 2005లో వచ్చిన ఈ చట్టాన్ని గత పన్నెండేండ్ల నుంచి దేశవ్యాప్తంగా ప్రజలు వినియోగించుకున్న తీరుపై శాస్త్రీయమైన అధ్యయనం ఏదీ లేదు. కొన్ని రాష్ర్టాల్లో, ప్రాంతాల్లో సేకరించిన చిన్నపాటి నమూనానే దేశవ్యాప్తంగా పరిస్థితి అంచనాకు ఉపయోగించుకుంటున్నారు. 2009 ప్రైస్ వాటర్ హౌస్ కూపర్ దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గ్రామీణ ప్రాంతాల్లో 13 శాతం మంది. అర్బన్ (పట్టణ) ప్రాంతాల్లో 33 శాతం మంది ఆర్టీఐ చట్టం గురించి అవగాహన కలిగి ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నది. చట్టం వచ్చిన నాలుగేండ్ల తర్వాత పరిస్థితిలా ఉన్నా, పన్నెండేండ్లు గడిచాయి కాబట్టి పరిస్థితి మెరుగుపడి ఉండవచ్చని ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కోసం నిర్వహించే ప్రాంతీయ సదస్సుల్లో వక్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కానీ చట్టం వచ్చి పుష్కరకాలం గడిచిన తర్వాత కూడా గ్రామీణ ప్రాంతాల్లో 12 శాతం అర్బన్ (పట్టణ) ప్రాంతాల్లో 33 శాతం మందికి ఆర్టీఐ చట్టంపై అవగాహన ఉందనే, అంచనా సరికాదేమోననిపిస్తున్నది. చాలామంది పాత్రికేయులు, న్యాయవాదులతో మాట్లాడినప్పుడు సమాచార హక్కు చట్టం అంటూ ఒక్కటి ఉందని తెలుసు కానీ, దీన్ని ఉపయోగించుకోలేదు, ఎలా ఉపమోగించుకోవాలో తెలియదనే సమాధానం వినిపించింది. కొందరు జిల్లాస్థాయి ప్రజా సమాచార అధికారులు సైతం చట్టం గురించి తెలియదని చెప్పడం విశేషం.

సమాచార కమిషనర్ వద్దకు విచారణకు వచ్చిన పూర్వ ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ఒకరు వట్టి చేతులతో వచ్చి ఆగస్టులో రిటైరవుతాను, నాకేమీ తెలియదు మా పైవాళ్లు తాము తప్పించుకోవడానికి నాపై వేశారు, నాకు ఈ బాధ్యత అప్పగించారని చెప్పుకొచ్చారు. అధికారులకే ఈ చట్టం గురించి సరైన అవగాహన లేనప్పుడు, సామాన్య ప్రజలకు ఉంటుందని ఎలా అనుకుంటాం.

ఎవరో కొద్దిమంది ఆర్టీఐ ఉద్యమకారులకు చట్టంపై అవగాహన ఉన్నంతమాత్రాన సరిపోదు. విస్తృత సంఖ్యలో మన ప్రజలకు ఈ చట్టంపై అవగాహన ఉంటే ప్రజలు ప్రశ్నించగలరు. ప్రజలు ప్రశ్నించినప్పుడు అధికారుల్లోనూ మార్పు వస్తుంది. వ్యక్తి ప్రయోజనాలు, అధికారులను లక్ష్యంగా చేసుకొనే సమాచారం కోసం కాకుండా, సమాజానికి మేలు చేసే సమాచారం కోరడం ప్రయోజనకరం. ఇద్దరు లేక ముగ్గురు చాలంటూ ఒకప్పుడు సాగించిన కుటుంబ నియంత్రణ ప్రచార ప్రభావం ఈ రోజు దేశం మొత్తంపై ఉన్నది. చదువుకున్నారా? చదువుకోలేదా? అనే తేడా లేకుండా మొత్తం దేశంపై ప్రభావం చూపిన ప్రచారం అది. ఆర్టీఐ ఉద్యమకారులు చట్టంపై అవగాహన ఉండి వందలాది పిటిషన్లు వేసి రికార్డులు సృష్టించడం కన్నా తమ పరిధిలో ఈ చట్టం గురించి సామాన్యులకు అవగాహన కలిగించడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. చేపలు పట్టివ్వడం కాదు, పట్టడం నేర్పించాలన్నట్టు ఉద్యమకారులకు అవగాహన కలిగించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. సామాన్య ప్రజలు ఇది మాకు మేలుచేసే చట్టం అని గ్రహించాలి. అంటే అధికార భాషలో అయితేనే సాధ్యమవుతుంది.

చట్టాలు ప్రజల భాషలో కూడా ఉన్నప్పుడు, ప్రజల భాషలో ఉన్నప్పుడు ప్రజలకు వాటిపై అవగాహన ఉంటుంది. తమకున్న హక్కుల గురించి తెలుస్తుంది. ప్రశ్నించే స్వభావం వస్తుంది. అందువల్లనేమో, వేల ఏండ్ల నుంచి అధికార యంత్రాంగం చట్టాలు ప్రజల భాషల్లో ఉండాలనే దానిపై ఏ మాత్రం ఆసక్తి చూపరు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వ్యవసాయశాఖ అధికారితో మంత్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. తమ శాఖ గురించి ఉన్నతాధికారి ఆంగ్లంలో ఉపన్యాసం ప్రారంభించారు. కొద్దిసేపటి తర్వాత ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని, తెలుగులో మాట్లాడలేరా? అని ప్రశ్నించారు. ప్రజల కోసం సమావేశం నిర్వహించి, వారికోసం చర్చిస్తున్నప్పుడు వారికి అర్థమయ్యే భాషలో మాట్లాడేందుకు అయిష్టత ఎందుకో? ప్రజలకు సేవలందించేందుకు అధికారులు, ప్రభుత్వ సిబ్బంది ఉంటారు. కానీ, ప్రభుత్వ యంత్రాంగం కోసం ప్రజలు కాదు. ప్రజలు, ప్రభుత్వానికి భాషే ప్రధాన అడ్డుగోడగా మారుతున్నది. చివరికి ఉత్తరాదికి చెందిన కొందరు ఐఏఎస్‌లు కూడా తెలుగు నేర్చుకొని కొత్త జిల్లాలకు కలెక్టర్లుగా ప్రజలకు చేరువవుతున్నారు. ప్రజల భాష, పాలకుల భాష వేరుగా ఉండటం ఆధునిక పోకడేమీకాదు. వేల సంవత్సరాల నుంచి వస్తున్న సంప్రదాయం. ప్రజాస్వామ్యంలో ఇదే విధానం కొనసాగడమే దురదృష్టకరం. ప్రముఖ చరిత్రకారులు రాహుల్ సాంకృత్యాయన్ ఋగ్వేద ఆర్యులు అనే పుస్తకంలో పాలకుల, పాలితుల భాష ఏ కాలంలో ఎలా ఉందో ప్రస్తావించారు.

ఉదాహరణకు.. దాదాపు మూడు వేల ఏండ్ల క్రితం అంటే.. త్రేతా యుగం, క్రీస్తుపూర్వం 1150లో భరత గణాల రాజుల సుదాసుపాలన పాలకులది ఛంద భాష, ప్రజలది, ద్రావిడ, కిరాత భాషలు. ఇక తెలంగాణలో ప్రజల భాష తెలుగు కాగా వందల సంవత్సరాల పాటు ఉర్దూ రాజభాషగా వెలుగొందింది. రాజరికంలో రాజు భాషనే అధికార భాషగా నిలిచింది. చిత్రంగా ప్రజాస్వామ్యంలో పాలకుల భాషకు కూడా పాలనలో ప్రాధాన్యం కనిపించడంలేదు. రాజోద్యోగుల భాషే రాజభాషగా నిలుస్తున్నది. ఇతర రాష్ర్టాలకు చెందిన కొంతమంది ఉన్నతోద్యోగాల కోసం ప్రజలు మాతృభాషకు దూరం కావాల్సిన పరిస్థితి. ఉద్యోగ, ఉపాధి, విదేశీ విద్య వంటి అవకాశాలకు ఇంగ్లీష్ అవసరమే కాదని ఎవరూ అనరు. సొంత రాష్ట్రంలో తెలుగుకు అంతే ఆదరణ ఉండాలి. డిసెంబర్‌లో ప్రపంచ తెలుగు మహాసభలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. సీఎం కేసీఆర్ సహజంగా తెలుగు భాషాభిమాని. ఏ సభలోనైనా తెలుగు పద్యాన్ని అలవోకగా వినిపిస్తారు.

తెలుగు మహాసభల సందర్భంగా పాలనతో తెలుగుకు పట్టం కట్టాలని కోరుకోవడం, కడుతారని ఆశించడం అత్యాశ ఏమీ కాదు. మా నిధులు, మా లెక్కలు అనేది ఆర్టీఐ నినాదం. దీనికితోడు మా చట్టం మా భాషలో అని కూడా భావించాలి.అప్పుడే ఎవరికోసం ఈచట్టం రూపొందించారో వారికి ప్రయోజనం కలుగుతుంది. శాసనసభలో మైనార్టీల సమస్యలపై చర్చకు సమాధానం ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఉర్దూను బతికించుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో వివరించారు. దాదాపు రెండు దశాబ్దాల నుంచి ఎంఐఎం శాసనసభాపక్షం నాయకులు ఎవరున్నా బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీలో ఉర్దూ అనువాదకుని పోస్టు భర్తీ చేయమని అడిగేవారు. అసముద్దీన్ నుంచి అక్బరుద్దీన్ వరకు బడ్జెట్ ప్రసంగంలో ఇది తప్పనిసరి. అసెంబ్లీలోనే కాదు, రాష్ట్రంలోని 31 జిల్లాల్లో, సీఎం కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి, మండలి శాసనసభలో ఉర్దూ తెలిసినవారిని నియమించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. ఇది చూసిన తర్వాత డిసెంబర్‌లో జరిగే ప్రపంచ తెలుగు మహాసభల్లో తెలుగు అమలుకోసం ప్రభుత్వం కచ్చితంగా కీలక నిర్ణయాలు తీసుకుంటుందనే ఆశ తెలుగు భాషాభిమానులకు కలుగుతున్నది. తెలుగు భాష పేరుతో రాష్ట్రం ఏర్పడినా, పాలనలో తెలుగు కనిపించలేదు. తెలుగును రాజకీయంగా ఉపయోగించుకున్నవారు కూడా తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వలేదు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు తెలంగాణలో తెలుగు భాషా పునర్నిర్మాణం సాధ్యమేనని అనిపిస్తున్నది.

**డిసెంబర్‌లో జరిగే ప్రపంచ తెలుగు మహాసభల్లో తెలుగు అమలుకోసం ప్రభుత్వం కచ్చితంగా కీలక నిర్ణయాలు తీసుకుంటుందనే ఆశ తెలుగు భాషాభిమానులకు కలుగుతున్న ది. తెలుగు భాష పేరుతో రాష్ట్రం ఏర్పడినా, పాలనలో తెలుగు కనిపించలేదు. తెలుగును రాజకీయంగా ఉపయోగించుకున్నవారు కూడా తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వలేదు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు తెలంగాణలో తెలుగు భాషా పునర్నిర్మాణం సాధ్యమేనని అనిపిస్తున్నది.**

(వ్యాసకర్త: రాష్ట్ర సమాచార కమిషనర్)